


Truth of News
PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 07 | శనివారం 01 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# గాజాలో శాంతి ఒప్పందం కుదిరింది



**- ఆయుధాలను హమాస్ విడనాడింది**
**- ఇక ఇజ్రాయిల్‌కు భద్రత లభిస్తుంది : ట్రంప్**

వాషింగ్టన్ - సూర్య వాస్తవం

గాజాలో హమాస్, ఇతర సాయుధ గ్రూపులు ఆయుధాలు విడనాడాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనిని చారిత్రక ఒప్పందంగా ఆయన అభివర్ణించారు. 'ఈ రోజు గాజాలో హమాస్, ఇతర సాయుధ గ్రూపులన్నీ పూర్తిగా ఆయుధాలను విడనాడాయి. శాంతి బోర్డు చారిత్రక ఒప్పందం కుదిర్చింది' అని ఆయన తన సామాజిక మాధ్యమ

- మిగతా 2లో..



## వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు

**- కారుణ్య నియామకంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు**
**- కారుణ్య నియామకాలకు పెళ్లైన కుమార్తెలు కూడా అర్హులేనని సుప్రీం స్పష్టీకరణ**
**- విడాకులు తీసుకున్న వారికే అర్హత అనే నిబంధన రాజ్యాంగ విరుద్ధమని తీర్పు**
**- కుమారులు, కుమార్తెల మధ్య వివక్ష చూపరాదని తేల్చిచెప్పిన ధర్మాసనం**
**- పిటిషనర్ అభ్యర్థనను 8 వారాల్లోగా పరిశీలించాలని బీహార్ ప్రభుత్వానికి ఆదేశం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వివాహిత అనే కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే

- మిగతా 2లో..

# నేడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

**- జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోడీ**
**- రూ.17,900 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం**



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారా మరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని? నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించ నున్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ఉదయం 11 గంటలకు పరిశీలిస్తారు. అలాగే భోగాపురంలో రూ.17,900 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ?ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో రూ.5,640 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేశారు. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా నిర్మించారు. ఈ విమానాశ్రయంలో కృత్రిమ మేధ (ఎఐ), బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బిఐఎం), ఎయిర్‌సైడ్ 4.0 సాంకేతిక పరిజ్ఞానాలు, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ (ఎపిఒసి), బయోమెట్రిక్ ప్యాసింజర్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ బ్యాగేజి హ్యాండ్లింగ్ వ్యవస్థలు, ఇంటిలిజెంట్ ఆపరేషనల్ మానిటరింగ్ సొల్యూషన్స్ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా

- మిగతా 2లో..



## తమిళనాడుకు ఇకపై నీటి విడుదల లేదు

**- సీఎం విజయ్ పర్యటన వాయిదా**
**- సీఎం డి.కె. శివకుమార్**

బెంగళూరు- సూర్య వాస్తవం

కావేరీ జల నిర్వహణ అథారిటీ (జఔపీూ) ఇటీవల జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో, రాష్ట్రంలో కావేరీ నీటి పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కావేరీ జల వివాదం, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యలపై చర్చించేందుకు ఆగస్టు 2 (ఆదివారం) నాడు బెంగళూరులోని తన అధికారిక నివాసం 'కృష్ణ'లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తెలిపారు. తమిళనాడుకు అదనంగా నీటిని విడుదల చేయలేదని, సహజంగా ప్రవహించే నీరు మాత్రమే తమిళనాడుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. కావేరీ జల నిర్వహణ అథారిటీ (జఔపీూ) కర్ణాటక అభ్యర్థనను తిరస్కరించి, కావేరీ జల నియంత్రణ కమిటీ (జఔ=జ) సిఫార్సును సమర్థించి,

- మిగతా 2లో..



## 33 శాతం కోటాను తక్షణమే అమలు చేయాలి

**- మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించే వరకు పోరాటం**
**- పదో రోజుకు మహిళా సంఘాల ఐక్య ఆందోళన**
**- రాజ్యసభ సీపీఐ(ఎం) పక్షనేత జాన్ బ్రిట్టాస్ సంఘీభావం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స (ఎన్‌సీడబ్ల్యూఆర్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఐక్య ఆందోళన శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు, అలాగే కేరళ నుంచి వచ్చిన భారీ

2లో

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే

**- పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు**
**- రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు**
**- నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్**



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమ ఓయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి

- మిగతా 2లో..

## విదేశీ ఉద్యోగార్థుల బాధ్యత టామ్‌కొందే

**పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు అన్నీ చూసుకోవాలి**
**- స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి**
**- ఏటీసీల్లో అప్‌గ్రేడ్ సిలబస్‌తో ఆధునిక కోర్సులకు ప్రాధాన్యం**
**- అవసరమైన చోట్ల నర్సింగ్ కళాశాలల ఏర్పాటు**
**- 'శక్తి' శాఖ సమీక్షలో సీఎం ఏ రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

వస్తే వీసా గడువు పొడిగింపు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ మార్పుతో పరిశోధన ఆధారిత, ఎక్కువ కాలం కొనసాగే డిగ్రీలు చదివే విద్యార్థులకు అనిశ్చితి ఏర్పడుతుందని నిపుణులు చెప్తున్నారు. అలాగే పట్టభద్రులైన తర్వాత కొంతకాలం అమెరికాలో ఉద్యోగ అనుభవం పొందే

- మిగతా 3లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# గాజాలో శాంతి ఒప్పందం కుదిరింది

(మొదటిపేజీ తరువాయి)

వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. చిరకాల శాంతి, భద్రత దిశగా ఇది అతి పెద్ద చర్య అని తెలిపారు. అయితే ఒప్పందం కుదిరిన విషయాన్ని హమాస్ ఇంకా ధృవీకరించలేదు. గాజాలో కార్యకలాపాలు సాగిస్తున్న మరో మిలిటెంట్ గ్రూప్ పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ మూవ్‌మెంట్ శుక్రవారం ఉదయం ఓ ప్రకటన చేస్తూ ఒప్పందం నివేదికలు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపింది. కాల్పుల విరమణలో హమాస్‌తో పాటు ఈ గ్రూపు కూడా భాగస్వామే.

**శాంతి బోర్డు ఏం చెప్పింది?**

హమాస్, ఇతర సాయుధ గ్రూపులు కమిటీకి ఆయుధాలు అప్పగిస్తాయని శాంతి బోర్డు ప్రతినిధి ఒకరు చెప్పారు. ముందుగా పోలీసు ఆయుధాల బదిలీ జరుగుతుందని, ఆ తర్వాత వ్యక్తిగత ఆయుధాల అప్పగింత పూర్తవుతుందని తెలిపారు. గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు, సాంకేతిక నిపుణుల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ట్రంప్ ప్రతిపాదించిన బహుళ దశల శాంతి ప్రణాళిక అమలులో హమాస్‌ను ఆయుధాలు విడనాడేలా చేయడం కీలకమైన అడుగు. ప్రణాళిక అమలు కోసం హమాస్‌తో మధ్యవర్తులు అనేక నెలలుగా సంప్రదింపులు జరుపుతున్నారు. కాగా ఒప్పందం అమలు విషయంలో హమాస్ తన మాటను నిలబెట్టుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'ఒప్పందం అమలైతే హమాస్ తన వద్ద ఉన్న ఆయుధాలను అప్పగిస్తుంది. అధికారం తాత్కాలిక యంత్రాంగం చేతికి వస్తుంది. ప్రభుత్వం, పాలన నుంచి హమాస్ వైదొలుగుతుంది. ఇవన్నీ పాలస్తీనా ప్రజలకు రాజకీయ భవిష్యత్తు కల్పిస్తాయి' అని శాంతి బోర్డు ప్రతినిధి వివరించారు. 'మొట్టమొదటిసారిగా తన వద్ద ఉన్న ఆయుధాలన్నింటినీ వదులుకునేందుకు ఓ ఆచరణాత్మక ప్రణాళికకు హమాస్ కట్టుబడి ఉంది. ఆ తర్వాత గాజా నుంచి ఇజ్రాయిల్ వైదొలుగుతుంది. మెరుగైన భవిష్యత్తు కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్న గాజా ప్రజలకు ఇది గణనీయమైన ప్రయోజనాలను, ఇజ్రాయిల్ ప్రజలకు భద్రతను అందిస్తుందని ఆశిస్తున్నాం' అని శాంతి బోర్డు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేసింది.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు: ట్రంప్**

ఈ ఒప్పందం గాజాను నూతన పాలస్తీనా ప్రభుత్వం పాలించేందుకు వీలు కల్పిస్తుందని, అది శాంతి బోర్డుతో కలిసి పనిచేస్తుందని ట్రంప్ చెప్పారు. గాజా ఇకపై ఉగ్రవాద దాడులకు స్థావరంగా ఉపయోగ పడకుండా ఇజ్రాయిల్‌కు భద్రత లభిస్తుందని అన్నారు. నెలల తరబడి జరిగిన చర్చల కారణంగా ముందడుగు పడిందని, ఏం చేయాలనే దానిపై అవగాహన కలిగిందని అమెరికా, శాంతి బోర్డు తెలియజేశాయి. అయితే ఇది షరతులతో కూడిన ఒప్పందమేనని స్పష్టం చేశాయి. ఒప్పందాన్ని కుదర్చడంలో సాయపడిన ఈజిప్ట్, ఖతార్, టర్కీ మధ్యవర్తులకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఎన్నటికీ సాధ్యం కాదని అందరూ భావించిన అద్భుతాన్ని అందించిన అందరికీ అభినందనలు' అని అన్నారు. ఒప్పందం అమలుకు సమయం పడుతుందని, రెండు వారాలలో షరతులను ప్రచురిస్తామని అధికారులు చెప్పారు.

# నేడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం



(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నంలో రూ.460 కోట్లకు పైగా పెట్టుబడితో అభివృద్ధి చేస్తున్న ఎఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తారు. దీనిని కొరియా రిపబ్లిక్‌కు చెందిన ఎపిఎసిటి భాగస్వామ్యంతో ఎఎస్ఐపి టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేస్తోంది.

ఇది ఆంధ్రప్రదేశ్‌లో తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రం. ఈ ప్లాంట్ ఏటా సుమారు 96 మిలియన్ల సెమీకండక్టర్ చిప్‌లను తయారు చేయడంతో పాటు అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగావకాశాలను కల్పిస్తుంది.కర్నూల్- ×ం రెన్యువబుల్ ఎనర్జీ జోన్ (ఆర్ఈజెడ్)- ఫేజ్- × (4.5 గిగావాట్లు) ఏకీకరణ కోసం ఏర్పాటు చేసే సరఫరా వ్యవస్థకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. దీనిని స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి)తో రూ.5,550 కోట్ల పెట్టుబడితో పవర్ గ్రిడ్ అమలు చేస్తోంది. రూ.3,550 కోట్ల వ్యయంతో నిర్మించే కర్నూలు పవన విద్యుత్ జోన్/సౌర విద్యుత్ జోన్ (ఆంధ్రప్రదేశ్)- పార్ట్ ఏ, పార్ట్ బి ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రధాని ప్రారంభిస్తారు. అలాగే రూ.820 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన అనంతపురం (2,500 మెగావాట్లు), కర్నూలు (1,000 మెగావాట్లు) సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్‌మిషన్ పథకాన్ని కూడా ప్రారంభిస్తారు. దీనిని పవర్ గ్రిడ్‌తో అమలు చేస్తున్నారు. ?అలాగే రూ.1,880 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. జాతికి అంకితమిస్తారు.

ఎన్‌హెచ్-365బిజిలో రేచర్ల నుంచి గుర్వాయిగూడెం వరకు ఉన్న సెక్షన్‌లో నాలుగు లైన్ల ప్రవేశ నియంత్రిత గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని, ఎన్‌హెచ్-365బిజిలో గుర్వాయిగూడెం నుంచి దేవరపల్లి వరకు ఉన్న సెక్షన్‌లో నాలుగు లైన్ల ప్రవేశ నియంత్రిత గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని, ఎన్‌హెచ్-67పై నాలుగు లైన్ల తాడిపత్రి బైపాస్‌నూ జాతికి అంకితమిస్తారు. ఎన్‌హెచ్-565లోని పెంచలకోన-యేర్పేడు విభాగంలో లింగసముద్రం వద్ద హైలెవెల్ వంతెనకు కూడా ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టులన్నీ విజయవాడ, ఇతర నగరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాయి.

రోడ్డు భద్రతను పెంపొందిస్తాయి. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణ దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గిస్తాయి. ప్రాంతీయ అనుసంధానాన్ని పెంపొందిస్తాయి. అనంతరం మధ్యాహ్నం 3:30కు ప్రధాని నరేంద్ర మోడీ మైసూరులోని రామకృష్ణ ఆశ్రమంలో స్వామి వివేకానంద కల్చరల్ యూత్ సెంటర్-వివేక స్మారకాన్ని ప్రారంభిస్తారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

# విదేశీ ఉద్యోగార్థుల బాధ్యత టామ్‌కాందే

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు కూడా పరిమితమయ్యే ప్రమాదం ఉంది. విదేశీ విద్యార్థుల వాటా ఐదు శాతం అమెరికాలో విదేశీ విద్యార్థులకు విద్య అందించడం కూడా ఒక రకమైన సేవల ఎగుమతేనని పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు మైఖేల్ ఎ. క్లెమెన్స్ తన అధ్యయనంలో పేర్కొన్నారు. అమెరికా సేవల ఎగుమతుల్లో దాదాపు ఐదు శాతం వాటా విదేశీ విద్యార్థుల నుంచే వస్తుందని ఆయన వివరించారు. కొత్త నిబంధనల కారణంగా విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గితే సేవల ఎగుమతులు దెబ్బతిని, అమెరికా వాణిజ్య లోటు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

**ఆవిష్కరణలు, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం**

అంతకంటే పెద్ద సమస్య నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత అని ఆ అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) రంగాల్లో విదేశీ విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని క్లెమెన్స్ పేర్కొన్నారు. అమెరికాలో చదివి అక్కడే ఉద్యోగాల్లో చేరే విదేశీ విద్యార్థులు సాధారణ గ్రాడ్యుయేట్లతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువగా కొత్త పేటెంట్లు నమోదు చేస్తున్నారని తెలిపారు. అమెరికాలో నమోదయ్యే మొత్తం పేటెంట్లలో దాదాపు 10 శాతం వరకు విదేశీ విద్యార్థులే కారణమవుతున్నారని ఆ పరిశోధన పేర్కొంది. అలాగే అమెరికాలో జన్మించిన గ్రాడ్యుయేట్లతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువగా స్టార్టప్ కంపెనీలను స్థాపిస్తున్నారని వెల్లడించింది. ఇటువంటి ప్రతిభావంతులైన విద్యార్థులు తగ్గిపోతే అమెరికాలో ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధి, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతుందని అధ్యయనం హెచ్చరించింది. భారీ మూల్యం తప్పదు. ఈ నష్టం విద్యా రంగానికే పరిమితం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో రూపుదిద్దుకోలేని కొత్త ఉత్పత్తులు, అభివృద్ధి చెందని తయారీ సాంకేతికతలు, ప్రారంభం కాని స్టార్టప్ సంస్థలు, నమోదు కాని పేటెంట్లు, దేశంలో పుట్టుకు రాని కొత్త పరిశ్రమల రూపంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక మూల్యం చెల్లించాల్సి వస్తుందని అధ్యయనం హెచ్చరించింది. దీంతో విదేశీ విద్యార్థులపై కఠిన ఆంక్షలు చివరికి అమెరికానే దెబ్బతీసే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా ?

విజయవాడ, జూలై 31, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ-గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది. మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ-గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ్య హక్కు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది.

బీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

# 33 శాతం కోటాను తక్షణమే అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి బృందం రంగురంగుల బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు, జెండాలతో ఆందోళనలో పాల్గొన్నారు.

**బీజేపీది మనువాద కుట్ర : జాన్ బ్రిట్టాస్**

మహిళల రాజకీయ హక్కుల కోసం నిలకడగా పోరాడుతున్న వామపక్ష పార్టీల తరపున మద్దతు, సంఘీభావం తెలిపేందుకు రాజ్యసభ సీపీఐ(ఎం) పక్షనేత జాన్ బ్రిట్టాస్ ఆందోళన ప్రదేశాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ చట్టం అమలును ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను ఆయన 'మనువాద కుట్ర'గా అభివర్ణించారు. పోరాటంతో తమ హక్కులను ఎలా సాధించుకోవాలో దేశంలో మహిళలకు తెలుసునని, ప్రభుత్వాన్ని బాధ్యత నుంచి తప్పించుకోనివ్వరని ఆయన అన్నారు. బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రజల ముందు బట్టబయలు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన సభలో పలు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. వీరిలో ఐద్వా జాయింట్ సెక్రెటరీ, ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఆశా శర్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు మైమూనా మొల్లా, మణిపూర్ నుంచి అరుణ, రహీనా బేగం రాజ్, వైడబ్ల్యూసీఏ నుంచి ప్రజ్ఞ, ఏఐపీడబ్ల్యూఏ నుంచి పూజ తదితరులు ఉన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం నిరంతరం నిరాకరిస్తుండటంపై వక్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు పునరుద్ఘాటించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సీనియర్ నాయకులలో ఐద్వా అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కె. శ్రీమతి, కనినిక ఘోష్, జాతీయ కార్యదర్శి సి.ఎస్. సుజాత, ఢిల్లీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు ఆశా యాదవ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిధు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నుంచి దీప్తి, సరస్వతి, 'టుగెదర్ ఫర్ ట్రాంక్విలిటీ' నుంచి భావన శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు ఈ ఆందోళన ప్రతిరోజూ కొనసాగుతుందని 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స్' మరోసారి స్పష్టం చేసింది. 33 శాతం రిజర్వేషన్ అమలులో ఇక ఏమాత్రం జాప్యాన్ని దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు అంగీకరించబోరని వివరించింది. సమాన రాజకీయ ప్రాతినిధ్యం అనే రాజ్యాంగ హామీ వాస్తవ రూపం దాల్చే వరకు దేశవ్యాప్త ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేసింది.

# తమిళనాడుకు ఇకపై నీటి విడుదల లేదు

(మొదటిపేజీ తరువాయి)

15 రోజుల పాటు రోజుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని తమిళనాడును ఆదేశించిన తర్వాత ఈ సమావేశం జరిగింది. కావేరీ బేసిన్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఈ సమావేశానికి ఆహ్వానించారు. కావేరీ జలాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర భవిష్యత్ న్యాయ, రాజకీయ పోరాట రూపరేఖలపై సమావేశంలో చర్చించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే

(మొదటిపేజీ తరువాయి)

సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు.

కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని

## భోగాపురంపై క్రెడిట్ వార్...




**విజయనగరం – సూర్య వాస్తవం**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రెడిట్ వార్ నడుస్తోంది. ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భోగాపురం క్రెడిట్ తమకే దక్కుతుందని మాజీ సీఎం జగన్ అంటే.. కూటమికే క్రెడిట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు అంటున్నారు. ఈ ఇద్దరిలో భోగాపురం క్రెడిట్ ఎవరిది?..విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైంది. ఆగస్టు 1న ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో ఉత్తరాంధ్రలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కుతుందనే అంశం తెరపైకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాలని జగన్ అంటుంటే.. కూటమి ప్రభుత్వానికే క్రెడిట్ దక్కుతుందని అధికార పార్టీలు అంటున్నాయి. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చోరీ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. తాను ఏమీ చేయకపోయినా కీర్తి తనకే దక్కాలంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పనులు ఓ కొలిక్కి తీసుకొచ్చామన్నారు.అయితే అసలు ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది తామేనని చంద్రబాబు అంటున్నారు. కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చి భూసేకరణ ప్రారంభించి శంకుస్థాపన చేశామన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 31 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. ఈ ఇద్దరి వాదనలు పక్కన పెడితే.. అసలు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బీజం ఎప్పుడు పడింది?.. 2016లో ప్రతిపాదనల దగ్గర నుంచి 2026 ప్రారంభోత్సవం వరకు ఏ ప్రభుత్వ హయాంలో ఏ పనులు జరిగాయో తెలుసుకుందాం..

### 2014 నుంచి 2019 వరకు ఏం జరిగింది?

రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో కీలకంగా మారింది. సాగరతీర నగరం పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. అక్కడ ఉన్న విమానాశ్రయం రక్షణ శాఖ ఆధీనంలో ఉంది. ఈ విషయాన్ని గమనించి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.. ఉత్తరాంధ్రలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భావించింది. 2016లో మరో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కొత్తగా ప్లాన్ చేస్తున్న ఎయిర్‌పోర్ట్ విశాఖపట్నానికి సమీపంలో ఉంటే బావుంటుందని భావించారు.. అందుకే భోగాపురంలో నిర్మించాలని ప్రతిపాదించగా కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అదే ఏడాది కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి టెక్నికల్, సైట్ అనుమతులు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు 15,000 ఎకరాల భూమిని సేకరించాలని భావించారు.. కానీ 2,700 ఎకరాలకు తగ్గించి భూసేకరణ ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేశారు. 2019 ఏప్రిల్ నెలలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది.

### 2019–2024 మధ్య ఏం జరిగింది?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణకు సంబంధించి అంశాలపై ఫోకస్ పెట్టింది. కోర్టు వివాదాలు, కేసుల్ని పరిష్కరించింది.. ఇందుకోసం భూసేకరణను 2200 ఎకరాలకు కుదించింది. భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి పునరావాసం కల్పించారు. అనంతరం భోగాపురం విమానాశ్రయం పనులకు సంబంధించి జీఎంఆర్ సంస్థతో కన్సెషన్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన ఎన్వోసీలు సహా మిగిలిన అనుమతుల్ని పొందారు. 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన (రెండోసారి) చేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వేగంగా చేరుకునేలా 77 మీటర్ల వెడల్పుతో, రూ. 6,300 కోట్ల ఖర్చుతో 55 కి.మీ. మేర ఆరు లేన్ల హైవేను కేంద్రం ప్రకటించింది. 2023 నవంబర్‌లో రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

### 2024–2026 హయాంలో ఏ పనులు చేశారు?

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయం పనులపై ఫోకస్ పెట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రి కావడంతో పనుల్లో వేగం పెరిగింది. ఏటీసీ టవర్, అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ వర్క్స్, సాంకేతిక పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వయంగా అక్కడ పనుల్ని పరిశీలించారు. 2024లో రన్‌వే, ట్యాక్సీవేలు, అప్రాన్ పనులు, టెర్మినల్ బిల్డింగ్ పనులు వేగవంతం చేశారు. ఎయిర్‌పోర్ట్‌లోని ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్గో కాంప్లెక్స్, ఐరన్ స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. 2024లో ఈ విమానాశ్రయానికి కూటమి ప్రభుత్వం మన్యం వీరుడు 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా పేరుపెట్టింది. అలాగే ఎయిర్‌పోర్టుకు జాతీయ రహదారి నుంచి అనుసంధానించే అప్రోచ్ రోడ్ల పనులు మొదలుపెట్టారు.2025లో టెర్మినల్ లోపల బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, సెక్యూరిటీ స్కానింగ్, ఆటోమేటెడ్ వ్యవస్థలకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అలాగే ఏటీసీ టవర్ నిర్మాణం ముగిసింది.. అక్కడ అవసరమైన రాడార్, కమ్యూనికేషన్ సిగ్నల్ పరికరాలను అమర్చారు. 2025లో మొదటిసారి తేలికపాటి విమానం సాయంతో ట్రయల్ రన్ పూర్తిచేసి.. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు అవసరమైన రోడ్ల పనులు కూడా చేపట్టారు. 2026 జనవరి 4న భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై తొలి వ్యాలిడేషన్ ఫ్లైట్ (ట్రయల్ రన్) విమానం ల్యాండ్ అయ్యింది. అంతేకాదు ఆడఅం (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి అవసరమైన ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు సేఫ్టీ, ఫైర్, పర్యావరణ అనుమతులు వచ్చాయి. అలాగే ఎయిర్‌పోర్ట్ లోపల ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా ఇంటీరియర్ ఆర్ట్ వర్క్స్ పనులు పూర్తి చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేషనల్ హైవేను కలిపే ముఖ్యమైన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం క్రెడిట్ ఎవరిది అనే చర్చను పక్కన పెడితే.. అటు వైఎస్సార్‌సీపీ, ఇటు కూటమి ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్‌లో కీలకపాత్ర పోషించాయి. 2016లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఎయిర్‌పోర్ట్‌కు బీజం పడింది. ప్రాజెక్ట్ ఆలోచన, ప్రతిపాదనతోపాటు కేంద్రం అనుమతులు సాధించింది చంద్రబాబు హయాంలోనే. అలాగే పనులను వేగవంతం చేసి, ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది కూడా కూటమి ప్రభుత్వం హయాంలోనే. అయితే జగన్ హయాంలో భూ వివాదాలు, కోర్టు కేసులను పరిష్కరించారు. జీఎంఆర్‌తో ఒప్పందం చేసుకొని భూమిని అప్పగించారు. రన్ వే నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ లాంటి పనులు వైసీపీ హయాంలోనే మొదలయ్యాయి. విజన్, పనులను వేగవంతంగా పూర్తి చేసిన విషయంలో క్రెడిట్ టీడీపీది కాగా.. భూసమస్యల పరిష్కారం, కన్సెషన్ ఒప్పందం

# అడ్డగోలుగా కోడిగుడ్ల అక్రమ రవాణా.!!



- పేద విద్యార్థుల కడుపు కొట్టిన కోడిగుడ్ల కాంట్రాక్టర్లు
- పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యతలేని కోడిగుడ్ల సరఫరా
- కాంట్రాక్టర్లకు వత్తాసు పలికిన హెడ్మాస్టర్లు, ఐసిడిఎస్ అధికారులు
- ప్రభుత్వ రికార్డుల్లో కాకి లెక్కలు..
- కోడిగుడ్ల సరఫరాలో రూ.50 లక్షలకు పైగా స్కాం..??
- చిక్కీలు, ప్యాడ్ల సరఫరాలో అవక తవకలు..
- ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే వెలుగులోకి అనేక అవినీతి అక్రమాలు వచ్చే అవకాశం..
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన విద్యార్థుల తల్లిదండ్రులు




**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:**

ఈయన పలుకుబడి కలిగిన కాంట్రాక్టర్ ఎవరైనా తన మాట వినకపోతే సంబంధిత ఉన్నతాధికారుల ద్వారా వారి పైన వత్తిడి తెప్పించి వారికి నచ్చినట్లు వ్యవహరించడం ఆయన నైజం... వారి మాట వినకపోతే ఇక్కడ ఏ అధికారి పని చేయలేరు.... కచ్చితంగా మనం చెప్పింది వారు విని తీరాల్సిందే.. ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి జిల్లా లో ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల వ్యవహార శైలి ఇది... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు అయితే శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు మాత్రం ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థులకు మెనూ ప్రకారం వాళ్లకు అందాల్సిన కోడిగుడ్లు అందకపోగా వారి కడుపులను కొట్టి లక్షలాది రూపాయలను అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు వీరికి జిల్లాలోని కొందరు హెడ్మాస్టర్లు, ఐసిడిఎస్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడంతో కాంట్రాక్టర్ల పంట పండుతోంది. ఈ రెండు శాఖలకు చెందిన అధికారులు చెప్పిన విధంగా పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేయకపోయినా చేసినట్లు రికార్డులలో సంతకాలు చేసి కాకి లెక్కలను వేసి ఆన్లైన్లో పెడుతున్నారు. ప్రత్యేకించి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసించడానికి వస్తున్నారు. లక్షలాది రూపాయలను వేతనాలు తీసుకుంటున్న హెడ్మాస్టర్లు కూడా పేద విద్యార్థుల కడుపు కొట్టి కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అదేవిధంగా శ్రీ సత్య సాయి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాలకు కోడిగుడ్ల



కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారం కోడిగుడ్లను రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసే విధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో ముందుకు వెళుతుండగా కాంట్రాక్టర్లు మాత్రం ఆయన ఆశయాలను కూడా పాటించకుండా తామనుకున్నదే గుట్టుచప్పుడు కాకుండా చేసుకుంటూ దొంగ బిల్లులు చేయాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు ఇప్పటికే సత్య సాయి జిల్లాలో సగం ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా చేయకపోయినా చేసినట్లు లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని అక్రమ మార్గంలో కాజేశారు.

శ్రీ సత్య సాయి జిల్లాలో 1610 ప్రైమరీ పాఠశాలలో 46,369 మంది, 83 అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 5012, 290 హైస్కూలలో 62,626 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 1983 ప్రభుత్వ పాఠశాలలో 11,4 007, మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

రికార్డుల్లో మాత్రం పాఠశాలలకు పూర్తిస్థాయిలో కోడిగుడ్లను సరఫరా చేస్తున్నట్లు అధికారులు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు ఇక్కడ మాత్రం పేద విద్యార్థులకు న్యాయం జరిగింది శూన్యం. జిల్లాలోని కోడిగుడ్లు సరఫరా కాని కొన్ని పాఠశాలలకు చెందిన కొంతమంది విద్యార్థిని విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు నేరుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు లిఖితపూర్వకంగా కాంట్రాక్టర్లతో పాటు సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు ఇప్పటికే సత్య సాయి జిల్లాలో జరుగుతున్న కోడిగుడ్ల సరఫరా లో సుమారు 50 లక్షల పైగా స్కాం జరిగింది ఈ స్కామ్ లో ఎవరెవరి పాత్ర ఎంతెంత ఉంది అనే విషయాలను జిల్లా కలెక్టర్ తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కూడా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు జిల్లాలో ఒక్కొక్క మండలానికి ఒక్కరు కాకుండా మరొక ఎంఈఓ కూడా ఉన్నప్పటికీ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడానికి ఒక్క ఎంఈఓ కూడా పూర్తిస్థాయిలో వెళ్లలేదనే విమర్శలు కూడా వ్యక్తం అవుతున్నాయి మరికొందరు ఎంఈఓ లు చుట్టచూపుగా వెళ్లి వచ్చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎంఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి మధ్యాహ్న భోజన పథకాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే అనేక అంశాలు కళ్ళకు కట్టినట్లు కనపడే అవకాశాలు ఉన్నాయి. పేద విద్యార్థుల విద్యార్థుల కడుపు కొట్టి అక్రమ మార్గంలో 50 లక్షలకు పైగా జరిగిన స్కామ్ లో ఏ అధికారికి ఎంతెంత వాటా ఉందో ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అనేక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా కోడిగుడ్ల సరఫరాలో జరిగిన స్కామ్ లో మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ వినయ్ మోహన్ పాత్ర కీలకంగా ఉంది అయితే ఆకలితో అలమటించిన విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలో కోడిగుడ్ల సరఫరా కానీ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కూడా ప్రధానోపాయలతో పాటు కాంట్రాక్టర్లపై గుర్రు మంటున్నారు. కోడిగుడ్ల తో పాటు చిక్కీలు , విద్యార్థినిలకు పంపిణీ చేసే ప్యాడ్ల సరఫరా లో కూడా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థినిలకు నెలసరి వచ్చినప్పుడు వాడే ప్యాడ్లు కూడా నాసిరకంగా క్వాలిటీ లేనివి సరఫరా చేస్తున్నట్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఆ విషయాన్ని తెలియజేశారు. వీరికి తోడు జిల్లాలోని పలు ప్రజాసంఘాల నాయకులకు కూడా ఈ విషయం అనోట ఈనోటపడివారికి తెలియడంతో వారు కూడా ఈ అవినీతి అక్రమాలపై ఉద్యమించడానికి సిద్ధమయ్యారు. ఈ విషయంపై మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ వినయ్ మోహన్ ను సంప్రదించగా తాము నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి బిల్లులు చేయలేదని కాంట్రాక్టర్లు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం మాత్రమే బిల్లులను చేశామంటున్నారు అదేవిధంగా డీఈవో కిష్టప్పను వివరణ కోరగా కోడిగుడ్ల సరఫరాలో అవకతోకలు జరిగాయ అనే విషయం తన దృష్టికి రాలేదని ఈ అంశం పైన విచారణ చేపట్టి అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే కోడిగుడ్లు, చిక్కిలు నాసికమైన ప్యాడ్ల సరఫరాలో జరిగిన స్కాం ఎవరి కొంప ముంచుతుందో ఎంతవరకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.



# 30 ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం

- 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంటింటి పర్యటన
- అభివృద్ధి, సంక్షేమానికి రూ.1,296 కోట్ల ఖర్చు
- అర్హులకు త్వరలో కొత్త పింఛన్లు మంజూరు
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు పాల్గొన్న స్థానిక టీడీపీ నాయకుడు బెస్త సంఘం అధ్యక్షులు చేపల హరి



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పరిష్కారం చూపిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఇంటి వద్ద కూటమి ప్రభుత్వ పాలనపై మంచి స్పందన లభిస్తోందని, తమ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 39వ డివిజన్‌లోనే సుమారు కోటి రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ముస్లిం, మైనార్టీ వర్గాల కోసం రూ.20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని పేర్కొన్నారు. నియోజ కవర్గంలో రెండేళ్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.200 కోట్లు ఖర్చు చేశామని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం మొత్తం రూ.1,296 కోట్లు వెచ్చించామని వివరించారు. గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపుతూ నిర్మాణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. నగరానికి డంపింగ్ యార్డు ప్రధాన సమస్యగా మారిందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ ప్రాంతంలో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి, మిగిలిన స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా పార్కు నిర్మించనున్నట్లు వెల్లడించారు. స్మార్ట్ సిటీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తు న్నామని చెప్పారు. నడమివంక, మరువవంక ప్రాంతాల్లో ప్రొటెక్షన్ వాల్స్, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడ్కో ఇళ్లతో పాటు పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేస్తామని, అర్హులైన వారికి త్వరలో కొత్త పింఛన్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం కేవలం బటన్లు నొక్కి ప్రజలను మభ్యపెట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బెస్త సంఘం అధ్యక్షుడు చేపల హరి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బర్తరఫ్ చేయాలి

- డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి
- విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను వెంటనే చెల్లించాలి
- 25 నెలల నిరుద్యోగ భృతి కింద రూ.75 వేలు ఇవ్వాలి
- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వైసీపీ నేతల వినతిపత్రం



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తక్షణం బర్తరఫ్ చేయాలని అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి తమ వద్ద ఉన్నట్లు పేర్కొన్న ఆధారాలను పెన్‌డ్రైవ్ రూపంలో జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌రెడ్డి, సమన్వయకర్తలు శైలజానాథ్, విశ్వేశ్వరరెడ్డి, రంగయ్య, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నైరుతిరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్లమెంట్ విభాగం రాష్ట్ర కార్యదర్శులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎల్.ఎం. మోహన్‌రెడ్డి,



యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, మాజీ మేయర్ మహమ్మద్ వసీం, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు కైలాష్‌తో పాటు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలి.**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం పొందడం నిరుద్యోగ యువత కల అని, ఆ కలను చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు ఛిద్రం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించారు. అర్హులైన అభ్యర్థులను పక్కనపెట్టి అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆధారాలతో సహా బహిర్గతం చేశారు. అన్యాయానికి గురైన అభ్యర్థులు కూడా తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు అని పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా నారా లోకేష్‌తో పాటు అధికార పార్టీ నాయకులు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై చర్చకు రావాలని లోకేష్ సవాల్ చేయడం సరికాదన్నారు. జోన్--1 పరిధిలో నవీన్ అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రశ్నపత్రాల తయారీలో కూడా భాగస్వామిగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అతడికి మొదటి ర్యాంకు రావడంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం అతడి పేరు లేదంటూ కోర్టును ఆశ్రయించినప్పటికీ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయలేదని ఆరోపించారు. టీచర్ పోస్టు కోసం బేరసారాలు జరిగినట్లు పేర్కొంటున్న వీడియోను కూడా పెన్‌డ్రైవ్‌లో జాయింట్ కలెక్టర్‌కు అందజేశామని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు.

**విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు చెల్లించాలి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలు రూ.9,500 కోట్ల మేర ఉన్నాయని వైఎస్ఆర్‌సీపీ నేతలు ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన నిధులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, గడిచిన 25 నెలలకు సంబంధించి ప్రతి నిరుద్యోగికి రూ.75 వేలు చెల్లించాలని కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఆగస్టు 3 నుంచి ఉద్యమ కార్యాచరణ**

డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బర్తరఫ్ చేయాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలపై వైఎస్ఆర్‌సీపీ ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ ప్రకటించిందని తెలిపారు. ఆగస్టు 3వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, రిలే దీక్షలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# జీవో 396ను ఉపసంహరించుకోవాలి: కేవీ రమణ

- పీపీపీ విధానంలో రిజిస్ట్రేషన్ సేవలు
- ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు అని ఆరోపణ
- దస్తావేజుల లేఖరుల పోరాటానికి వైసీపీ మద్దతు



**అనంతపురం సిటీ- సూర్య వాస్తవం :** వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తులను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వాధీనం చేసుకుంటున్నారని ఎన్నికల సమయంలో చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేశారని కేవీ రమణ విమర్శించారు. ఆ ప్రచారం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందిన తర్వాత, ప్రస్తుతం అదే రీ-సర్వే ప్రక్రియను కొనసాగించడంతో పాటు భూముల రిజిస్ట్రేషన్ సేవలను పీపీపీ విధానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు జీవో నంబర్ 396ను తీసుకురావడం ప్రజల ఆస్తులను ప్రైవేటు చేతుల్లో పెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. భూముల రిజిస్ట్రేషన్ సేవలను పీపీపీ విధానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఉద్దేశంతో తీసుకువచ్చినట్లు ఆరోపిస్తున్న జీవో నెంబర్ 396ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ డిమాండ్ చేశారు. జీవో 396 అమలుతో సబ్-రిజిస్ట్రార్ వ్యవస్థ బలహీనపడటంతో పాటు ప్రజల ఆస్తుల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ఏవైనా లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని, ప్రైవేటు ఏజెన్సీల వల్ల జరిగే పొరపాట్లకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పోలీసు, రెవెన్యూ శాఖల మాదిరిగానే ప్రజల ఆస్తి హక్కులతో నేరుగా సంబంధం ఉన్న సబ్-రిజిస్ట్రార్ వ్యవస్థ కూడా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని కేవీ రమణ పేర్కొన్నారు. కీలకమైన రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటుపరం చేయడం వల్ల ప్రజల హక్కులు, ఆస్తుల భద్రతపై సందేహాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. జీవో 396 వల్ల దస్తావేజుల లేఖరులు, వారి కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని తెలిపారు. దస్తావేజుల లేఖరులు చేస్తున్న పోరాటం కేవలం వారి ఉపాధి కోసం మాత్రమే కాకుండా, ప్రభుత్వ ఆధీనంలోని రిజిస్ట్రేషన్ వ్యవస్థను పరిరక్షించేందుకు కూడా జరుగు తోందని అన్నారు.

ఈ ఉద్యమానికి ప్రజా స్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కేవీ రమణ పిలుపునిచ్చారు. సబ్-రిజిస్ట్రార్ వ్యవస్థను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్

## - ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి- సూర్య వాస్తవం :** స్థానిక టీడీపీ కార్యాలయంలో 52వ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజలు, పార్టీ నాయకుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# వైభవంగా రేణుకఎల్లమ్మ బోనాలు ఊరేగింపు




**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని వాణీనగరులో( విజ్ఞాన్ స్కూల్ సమీపంలో) వెలసిన రేణుకఎల్లమ్మ అమ్మవారి బోనాలు శుక్రవారంన ఆ దేవాలయం నుండి ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు ఆధ్వర్యంలో పామిడి పట్టణ పురవీధుల గుండా పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా భక్తాదులు బోనాలు ఎత్తుకున్న మహిళలకు నిండు కడవ నీరు పాదాలకు పోసి పసుపు కుంకుమలు అంటిస్తూ కాయ కర్పూరం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు రంగనాయకులు పురోహితురాలు రామేశ్వరమ్మ ఓబులపతి బెస్త సుబ్రహ్మణ్యం ఓబులేషు సుబ్బరాయుడు పరుశరాములు వరాలమ్మ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించండి

## - నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో పెన్నానది ఒడ్డున వెలసిన ప్రసిద్ధి గాంచిన పురాతన పుణ్యక్షేత్రంమైన శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకున్నందున ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంజూరు చేయడం అయింది. ఇందులో సీజీఎఫ్ మ్యాచింగ్ గ్రాంటు రూ.40లక్షలు దేవాలయ కమిటీ సభ్యులు, దాతలు చెల్లించాలి. ఈసీజీఎఫ్ గ్రాంటు చెల్లించడం భారం అవుతుందని,ఈ విషయాన్ని ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ కమిషనరుతో మాట్లాడి మ్యాచింగ్ గ్రాంటును కుదించి రూ.20 లక్షలు చెల్లించేలా ఉత్తర్వులను మంజూరు చేయించారు. దీంతో భక్తాదులు పట్టణ ప్రజలు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యే జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తాదులు ఆలయ నిర్మాణానికి ఇచ్చే దాతలు, భక్తులు ఉంటే ఆలయ ప్రధాన పురోహితుడు నాగపురుషోత్తంకు శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం, ఫోన్ నంబరు 7893198825కు సంప్రదించవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులుతెలిపారు.

# చెట్నేపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండల పరిధికి సం బంధించి స్థానిక చెట్నేపల్లి గ్రామం యందు పౌర హ క్కులదినోత్సవ కార్యక్రమం లో పాల్గొన గుత్తి మున్సిప ల్ కమీషనర్ బి.జబ్బార్ మి యా,తాసీల్దార్ పుణ్యవతి, ఏ.యస్.ఐ రామాంజనేయులు, ఐసిడియస్ సూప రవైజర్ దస్తగిరమ్మ, గుత్తి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌర హక్కుల గురించి, ప్రాము ఖ్యత గురించి వివరించారు. పౌర హక్కుల ప్రకారం జీవన విధానం, సామాజిక బాధ్యతలపై అందరూ సహకరించి జీవనం పెంపోందించుకోవడము గురించి తెలియజేశారు.





## జోనల్ ఇన్చార్జ్ శ్రీనివాసరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్



**పామిడి – సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ రాయలసీమ జోనల్ ఇన్చార్జ్ రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డిని గుంతకల్ నియోజకవర్గం టిడిపి నాయకులు కార్యకర్తలు, కడపలోని ఆయన పిలుపుమేరకు తన స్వగృహం నందు శుక్రవారం రోజున మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ నేతృత్వంలో వారిని కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమస్యలు, పార్టీ యొక్క స్థితిగతుల గూర్చి జోనల్ ఇన్చార్జి శ్రీనివాసరెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమలో గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య,పామిడి మాజీ కౌన్సిలర్ వై.యు.రామాంజనేయులు, పామిడి మాజీ టౌన్ కన్వీనర్ రామకృష్ణ,రవి శంకరగౌడ్ గుత్తి టౌన్ మాజీ మండల కన్వీనర్,మహమ్మద్ వలి,గుత్తి క్లస్టర్ ఇంచార్జ్ నెట్టికంటయ్య,గుత్తి క్లస్టరు ఇంచార్జులు బండిలక్ష్మీదేవి,గుంటకల్ 14వ వార్డు బూతు ఇంచార్జ్ ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ శివప్ప, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రంగనాయకులు, మాజీ మండల కన్వీనర్ బూత్ ఇంచార్జ్, శివయ్య,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుంతకల్ క్లస్టర్ ఇంచార్జ్ పాతకొత్తచెరువు పద్మావతి,గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, ఈకార్యక్రమంలో తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి గాయపడిన వీరాంజనేయులు కుమారుడు

**- పరామర్శించిన రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం గుత్తి మండలం ఇ సురాలపల్లి గ్రామానికి చెందిన వీ రాంజనేయులు కుమారుడికి ప్రమా దవస్తు విద్యుత్ షాక్ తగిలి గుత్తి ప్ర భుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొం దుతున్న విషయం తెలుసుకున్న మాజీ జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర కార్మి క సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ వెళ్ళి పరామర్శించి, డాక్టరుతో మాట్లాడి తగిన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండలం టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

**- మార్కెట్ యార్డు అభివృద్ధిపై కీలక తీర్మానాలు**

**- మౌలిక వసతుల కల్పనకు పలు కీలక తీర్మానాలు**

**అనంతపురం టౌన్– సూర్య వాస్తవం :** వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడం, వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాలపై పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.




# 9వ వార్డులో టీడీపీ డోర్ టు డోర్ కార్యక్రమం

**- పాల్గొన్నఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్**

**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం 9వ వార్డ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంతకల్లు నియో జకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకి గుత్తి పట్టణం 9వ వార్డ్ కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్ కార్యక్రమం గుత్తి పట్టణం 9వ వా ర్డ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వెంకటశివుడు యాదవ్ వార్డులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ అందరిని ఆ ప్యాయంగా పలకరించారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత 3వేలు వున్న పెన్షన్ 4వేలకు పెంచారు. వికలాంగులకు 6000 వేలు, మంచానికి పరిమితం అయిన వాళ్లకు 15 వేలు చేశారు. మహిళలకు సంవత్సరానికి 3గ్యాస్ సిలిండర్లు,తల్లి కి వందనం కింద ఇంటిలో ఎంతమంది చదివే పిల్లలు ఉంటే అంతమంది కి 1300 0 వేలు ఇస్తున్నారు అని తె లిపారు.రైతులకు సంవత్స రానికి 20,000 వేలు రైతు ల ఖాత లో జమ చేశారు అ ని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిం చడం ఒక్క మన కుటుంబ ప్రభుత్వానికి మాత్రమే సా ధ్యమని తెలియజేశారు.కా బట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను, రాబోయే ఎన్నికల్లో మన కు టుంబ ప్రభుత్వాన్ని ఆశీర్వ దించి స్థానిక వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్ర మంలో గుత్తి పట్టణ, మండల కూటమి నా యకులు,కార్యకర్తలు మరి యు 9వ వార్డు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# విద్యార్థుల భద్రతే ధ్యేయం..

**- జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో పోలీసుల ప్రత్యేక అవగాహన సదస్సులు**

**- మహిళలు, చిన్నారుల రక్షణపై విద్యార్థులకు కీలక సూచనలు**

**- ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన**

**- మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని విద్యార్థులకు అవగాహన**

**- చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా పోలీసుల పిలుపు**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** సమాజంలో చిన్నారులు, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రక్షణ చట్టాలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.

**మహిళలు, చిన్నారులపై వేధింపులకు తావులేదు**

మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందని పోలీసులు తెలిపారు. చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన పోక్సో చట్టం ప్రాధాన్యాన్ని వివరించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



**అత్యవసర సమయంలో 112, 100 సేవలు వినియోగించాలి**

ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం 112 ఏకీకృత అత్యవసర సేవలను, అవసరమైన సందర్భాల్లో 100 పోలీసు సేవలను వినియోగించుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. సైబర్ వేధింపులు లేదా ఇతర అనుమానాస్పద ఘటనలు ఎదురైతే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం వంటి కీలక వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం**

18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, వాహన యజమానులపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.
విద్యార్థులు చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పాఠశాల, కళాశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలను

# ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**- ఐఎఫ్‌పీ ప్యానెల్ వినియోగం, బోధన విధానంపై హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్న కలెక్టర్**

**- వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్ ఆనంద్**

**కూడేరు – సూర్య వాస్తవం :**
కూడేరు మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో ఉన్న పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్ర వారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పదవ తరగతి విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆకాంక్షించారు.పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్, ల్యాబ్‌ను ఎంతో చక్కగా ఏర్పాటు చేశారని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. తదుపరి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారిలో చదువుపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో ఆధునిక సౌకర్యాలతో కూడిన మంచి ల్యాబ్‌తో పాటు సమర్థవంతమైన ఉపాధ్యాయులు ఉన్నారని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను ఎలా వినియోగిస్తున్నారని, విద్యా ర్థులకు ఏ విధంగా బోధన అందిస్తున్నారనే అంశాలపై హెడ్‌మాస్టర్‌ను కలెక్టర్ అడిగి తెలు సుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ నాగరాజు, తహసీల్దార్ మోహన్ కుమార్, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కమిషనర్‌ను కలిసిన ఏపీ యన్జిఓస్



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు తాలూకా ఏపీ యన్జిఓస్ అసోసియేషన్ అధ్యక్షులు, జెఏసి చైర్మన్ జె.రామ సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో కొత్తగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్‌ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ యన్జిఓస్ అంటే తనకు అభిమానం ఉందని అలాగే సంఘం నేపథ్యం నుండి వచ్చిన వాడిని అని ఏపీ యన్‌జిఓస్‌లో నేను ఒక మెంబర్ అని కొనియాడారు. అధ్యక్షులు మాట్లాడుతూ కమిషనర్‌కి సంఘం నుండి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. మరియు తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కమిషనర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఇ. ప్రమీల, ఉమెన్ వింగ్ చైర్మన్ అరుణాదేవి వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, వరప్రసాద్, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సుజాత, సచివాలయ ఉద్యోగుల ప్రెసిడెంట్ పేరయ్య, సెక్రటరీ ఓంకార్ , ఉమెన్ వింగ్ మెంబర్ రాజ్యలక్ష్మి,మహేశ్వరయ్య, సుధాకర్ మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## యువతకు మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి అవగాహన



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు శుక్రవారం నాడు ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం), నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి వాటి వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ కార్యక్రమం చేయించడం జరిగింది సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ముడియం గురు స్వప్న నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ రవి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో మత్తు పదార్థాల వినియోగం అధికమవుతుందని దీనివల్ల ప్రపంచానికి పెనుముప్పు తలెత్తి అవకాశం ఉన్నందున మత్తు పదార్థాలను వినియోగించడం పూర్తిగా నిర్మూలించాలని మత్తు పదార్థాలు రహిత సమాజ జీవనానికి ప్రతి ఒక్కరూ కృషిచేసి సమాజానికి మత్తు పదార్థాలను దూరం చేసే విధంగా విద్యార్థులకం యువత ముందుకు వచ్చి చొరవ చూపాలని ముందుగా మనం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మన తోటి స్నేహితులకు బంధువులకు ఇరుగుపొరుగు వారికి మత్తు పదార్థాల అనర్థాల గురించి వాటి వలన జరిగే చెడు ప్రభావాల గురించి అవగాహన కల్పిస్తూ నవ సమాజ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన చైతన్యవంతమైన సాధికార కరిగిన యువశక్తిగా ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్ అధ్యాపకులు శోభారాణి రమణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలేపు శ్రీనివాసులుపై చట్టపరంగా కేసు నమోదు చేయాలి

**- వ్యక్తిగత గౌరవాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారని ఫిర్యాదు**

**- దత్తాత్రేయ స్వామి**

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాలేపు శ్రీనివాసులుపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని బ్రహ్మంగారిమఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి సోదరుడు దత్తాత్రేయ స్వామి, ఆయన మిత్రులతో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, కంది మల్లయ్యపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1991--92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అందరూ కలిసి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారిని దర్శించుకుని, అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారిమఠం నాలుగు రోడ్ల కూడలిలో తన చిన్ననాటి స్నేహితులతో కలిసి దత్తాత్రేయ స్వామి సరదాగా ఒక పాటకు నృత్యం చేశారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, పాలేపు శ్రీనివాసులు అనే వ్యక్తి ఆ వీడియోను వివిధ సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేస్తూ, "మఠాధిపతి తమ్ముడు అయి ఉండి ఇలా నృత్యం చేయవచ్చా" అని వ్యాఖ్యానించడమే కాకుండా, "ఒక చేతిలో మందు బాటిల్, మరో చేతిలో మగువ ఉంటే బాగుండేది" వంటి అవమానకర వ్యాఖ్యలు జోడించి తన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి అసత్య, అవమానకర ప్రచారం వల్ల తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని దత్తాత్రేయ స్వామి తెలిపారు. ఈ ఘటనపై పాలేపు శ్రీనివాసులుపై చట్టపరంగా కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.



# ఘనంగా అమర రాజా మోడల్ యునైటెడ్ నేషన్స్ ఎడిషన్ -2 నిర్వహణ



**తిరుపతి - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాఘంలోని అమరరాజా విద్యాలయంలో అమరరాజా మోడల్ యునైటెడ్ నేషన్స్ ఎడిషన్--2 కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అమరరాజా గ్రూప్ హెడ్--హెచ్ఆర్ షేర్డ్ సర్వీసెస్ కె. నళినీ కుమార్, రాజన్న ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ ఆర్. సతీష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన 11 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన వివిధ కమిటీ సమావేశాల్లో విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమకాలీన సమస్యలపై చర్చలు, వాదోపవాదాలు నిర్వహించి, తీర్మానాలను రూపొ ందిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, మోడల్ యునైటెడ్ నేషన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచనా విధానం, దౌత్య నైపుణ్యాలు, బృంద సహకార భావన, సమర్థ వంతమైన సంభాషణా నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రపంచ దృక్పథాన్ని విస్తృతం చేయడంతో పాటు అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయ శాస్త్రం, మానవ హక్కులు, న్యాయశాస్త్రం, సివిల్ సర్వీసెస్ వంటి రంగాల్లో రాణించేందుకు బలమైన పునాదిని వేస్తాయని



పేర్కొన్నారు. అమరరాజా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్. జయశ్రీ మాట్లాడుతూ, విద్యార్థులను ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో వరుసగా రెండో ఏడాది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రపంచ పౌరసత్వ భావనను పెంపొందించే ఇటువంటి వినూత్న కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఈ అనుభవం తమలో బహిరంగ ప్రసంగ నైపుణ్యం, సమస్యల పరిష్కార సామర్థ్యం, అంతర్జాతీయ అంశాలపై అవగాహనను మరింత పెంపొందించిందని ఆనందం వ్యక్తం చేశారు.

# వాసుదేవరెడ్డి సేవలు వెలకట్టలేనివి

**-ఆదర్శ ఉపాధ్యాయుడు వాసుదేవరెడ్డి**

**-సన్మాన సభ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు**



**రాయచోటి - సూర్య వాస్తవం:** ఒక ఉపాధ్యాయునిగా ఉపాధ్యాయ సంఘ నాయకునిగా విద్యారంగానికి వాసుదేవరెడ్డి అందించిన సేవలు ఎనలేనివని ఎస్టీయు జిల్లాశాఖ అధ్యక్షుడు ఏ.శివారెడ్డి, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన (ఏఐఎఫ్ఇటిఓ) జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డిలు అన్నారు. మండలంలోని మాధవరం తెలుగు ప్రాథమిక పాఠశాల యందు సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేస్తూ,పదవీ విరమణ చెందిన వాసుదేవరెడ్డి సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ రమణయ్య అధ్యక్షతన శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శివారెడ్డి, రమణారెడ్డి లు మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాల కాలం పాటు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని నిర్వహించి వేలాదిమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది, సమాజానికి అందించడంలో వాసుదేవరెడ్డి చేసిన కృషి ఎనలేనిది అన్నారు. రాయచోటి ప్రాంతంలో ఒక మంచి ఉపాధ్యాయుడుగా పేరొందిన వాసుదేవరెడ్డి పదవి విరమణ చెందడం విద్యారంగానికి తీరని లోటు అన్నారు. అదేవిధంగా రాష్ట్రోపాధ్యాయ సంఘంలో క్రియాశీలక నాయకునిగా ఈ ప్రాంతంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాలలో, ఉద్యమాలలో తనవంతు కీలక పాత్ర పోషించారన్నారు. మూడు,నాలుగు దశాబ్దాల పాటు విద్యారంగానికి సమాజానికి సేవలందించి పదవీవిరమణ చెందిన ఉద్యోగ,ఉపాధ్యాయులకు పెన్షన్ ప్రయోజనాలతో పాటు మిగిలిన ఆర్థిక ప్రయోజనాలన్నింటిని సత్వరం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి వారి పదవీ విరమణానంతర జీవితం సుఖ సంతోషాలతో సాగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.. తదనంతరం వాసుదేవరెడ్డి దంపతులను ఎస్టీయు నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు, తల్లిదండ్రులు తదితరులు శాలువా, పూల మాలలు, బహుమతులతో ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు సీనియర్ రాష్ట్ర నాయకులు వై.రవీంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎలినినో పైన రైతులకు అవగాహన

**- ఊటుకూరు వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి ప్రభాకర్ రెడ్డి**



**ముద్దనూరు - సూర్య వాస్తవం:** మండలంలోని మంగపట్నం గ్రామంలో ఎలినినో ప్రభావం గురించి గ్రామ రైతులతో అవగాహన సమావేశంలో డిడిఏ టి వెంకటేష్ అలాగే కడప వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి, కేవికె శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, ఆగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం, ఎడి ఏ కె రామమోహన్ రెడ్డి, మరియు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలినినో ప్రభావం ను తట్టుకునే పంటలను సాగు చేయాలి అని తెలిపారు. బెట్ట పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలి అని సూచించారు. ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి అన్నారు.స్వల్ప కాలిక రకాలైన కంది, జొన్న, ఉలవ, కొర్ర, రాగి, మినుము ,సజ్జ పంటల పైన రైతులు దృష్టి సారించాలి అన్నారు. వ్యవసాయ రంగంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి,వాటి వాడకం వలన రైతులకు కలిగే మేలు గురించి అవగాహన కల్పించారు. కీటక విభాగం శాస్త్రవేత్త సునీల్ మాట్లాడుతూ ఆయా పంటల్లో ఆశించే చీడ పీడలు మరియు వాటి నివారణ చర్యలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. బత్తాయి పంటలో పొలుసు పురుగు నివారణ గురించి, ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ఎకరానికి 8 చొప్పున లింగా కర్షక బట్టలను పొలంలో పెట్టుకోవాలి అన్నారు.సిపారస్ చేసిన మందులను సూచించిన పరిమాణం మేరకే వాడుకోవాలి అన్నారు. అనంతరం అగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి అన్నారు.యూరియా వాడకాన్ని తగ్గించాలి అన్నారు. ఎలినినో నుండి తట్టుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. డిడి ఏ టి.వెంకటేష్ మాట్లాడుతూ క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో ఉదయం లేదా సాయంత్రం వేళల్లో సమయ పాలన పాటించి, సిపారసు చేసిన పరిమాణం మేరకు మందు ద్రావణం ను పిచికారీ చేయాలి అన్నారు. మొక్క బాగా తడిచే విధంగా ఆకులపైన పడేటట్లు పిచికారీ చేయాలి అని సూచించారు. ప్రధాన మంత్రి పసల్ భీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.రేపటి తో గడువు ముగుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కేవికె శాస్త్రవేత్తలు డాక్టర్ శిల్ప కళ, పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ , డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ యన్.క్రిష్ణ ప్రియ మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది,పకృతి వ్యవసాయ సిబ్బంది,మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన ఎయిర్టెల్ నెట్‌వర్క్

**- ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎయిర్టెల్ మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా నిలిచిపోవడంతో మండల ప్రజలు, వ్యాపారులు, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ, నెట్‌వర్క్ అంతరాయం కారణంగా ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. దీంతో అత్యవసర సమాచార మార్పిడి, డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవలు స్తంభించి పోయాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడలేక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.పుణ్యక్షేత్రానికి వచ్చిన వేలాది మంది భక్తులు తమ బంధువులతో సంబంధాలు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యాపారులు యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపులు నిలిచిపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు.ఎయిర్టెల్ సంస్థ అధికారులు వెంటనే స్పందించి నెట్‌వర్క్ సమస్యకు గల కారణాలను వెల్లడిం చడంతో పాటు సేవలను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.

# 'పోలీస్ కంప్లైంట్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



వరలక్ష్మి శరత్ కుమార్‌కి తెలుగులోను మంచి క్రేజ్ ఉంది. లేడీ ఓరియెంటెడ్ కథలు .. విలనిజంతో కూడిన కీలకమైన పాత్రలను పోషిస్తూ ఆమె ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నారు. ఆమె ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'పోలీస్ కంప్లైంట్'. హారర్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సినిమాకి సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించాడు. జూన్ 12వ తేదీన థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేశారు. అలాంటి ఈ సినిమా ఈ రోజు (జులై 31)నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది.

'మహాంకాళి' (రవి శంకర్) వెయ్యికోట్ల ఆస్తులకు అధిపతి. ఆస్తులను అనుభవించడం కోసం ఆయుష్షును పెంచుకోవాలనే ఒక దురాశతో క్షుద్రపూజలు చేస్తూ ఉంటాడు. అతని పూజకు భంగం కలిగించకుండా అనుచరులు కాపలా ఉంటారు. మరో వైపున నగరంలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. గొలుసులతో 'ఉరి' బిగించి చంపుతుండటంతో, ఇదంతా ఎవరో సీరియల్ కిల్లర్ చేస్తున్న హత్యలుగా అనుమానిస్తారు. ఈ కేసును ఛేదించడానికి సీత వరలక్ష్మి ( వరలక్ష్మీ శరత్ కుమార్) రంగంలోకి దిగుతుంది. సీత వరలక్ష్మీ ఏఎస్పీ గా పనిచేస్తుంటుంది. ఆమె భర్త రామ్ ప్రసాద్ ( నవీన్ చంద్ర) ఓ డాక్టర్. వాళ్లకి 'భవిత' అనే ఒక కూతురు ఉంటుంది. సీతా వరలక్ష్మికి రీల్స్ చేయడం .. పబ్లిసిటీ పిచ్చి ఎక్కువ. అందువలన ఆమె సిన్సియర్ గా డ్యూటీ పై దృష్టి పెట్టేది చాలా తక్కువ. ఇక ఆమెకి రామ్ ప్రసాద్ అంటే అమితమైన ప్రేమ .. అపారమైన నమ్మకం. అతను కూడా ఆమెతో అలాగే ఉంటూ ఉంటాడు. అందువలన ఆమె చాలా హ్యాపీగా తన కెరియర్ ను కొనసాగిస్తూ ముందుకు వెళుతుంటుంది. వరుస హత్యల గురించి ఇన్వెస్టిగేట్ చేస్తున్న సీత వరలక్ష్మి కి అపుడప్పుడు 'అద్వైత' అనే పాప తారసపడుతూ ఉంటుంది. తనకి తండ్రి కావాలని అడుగుతూ, తన తండ్రి ఫలానా అని చూపిస్తూ ఉంటుంది. ఆమె అలా ఎవరినైతే చూపిస్తుందో ఆ మరుసటి రోజునే వాళ్లు దారుణంగా హత్య చేయబడుతూ ఉంటారు. ఇదంతా సీత వరలక్ష్మికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అలా ఒక రోజున ఆ పాప తన తండ్రి అతనేనంటూ, హోమ్ మినిష్టర్ కొడుకు 'రాకేశ్' ను చూపిస్తుంది. దాంతో సీత వరలక్ష్మి ఉలిక్కి పడుతుంది. రాకేశ్ ను ఎలాగైనా కాపాడాలనే ఉద్దేశంతో హోమ్ మినిష్టర్ ఇంటికి వెళుతుంది. అక్కడ ఏం జరుగుతుంది? రాకేశ్ ప్రాణాలను ఆమె కాపాడగలుగుతుందా? హత్యకి గురవుతున్నవారి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? అద్వైత ఎవరు? ఇన్వెస్టిగేషన్ లో సీత వరలక్ష్మికి తెలిసే మరో చేదు నిజం ఏమిటి? అనేది మిగతా కథ.

ఒక వైపున క్షుద్ర పూజలు .. మరో వైపున వరుస హత్యలు .. ఈ మధ్యలో సాగే ఇన్వెస్టిగేషన్ చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఈ హత్యలకు .. దెయ్యానికి గల సంబంధం ఏమిటనేది ఆడియన్స్‌లో కుతూహలాన్ని రేకెత్తిస్తూ ఉంటుంది. సాధారణంగా దెయ్యం కథలు రివేంజ్ లో నుంచే పుట్టుకొస్తూ ఉంటాయి. ఆ మాటకొస్తే ప్రతీకారం తీర్చుకోవడానికే ప్రేతాత్మలుగా మారతారు అని కూడా చూపిస్తూ ఉంటారు. అలాంటి ఒక రివేంజ్ కథతోనే రూపొందిన సినిమా ఇది. వరలక్ష్మీ శరత్ కుమార్ పోలీస్ ఆఫీసర్ అనగానే ఆమె పాత్రను ప్రేక్షకులు ఒక రేంజ్ లో ఊహించుకుంటారు. కానీ ఈ సినిమాలో ఆమె పాత్ర కాస్త కామెడీ టచ్ తో మొదలవుతుంది. చుట్టూ ఉన్న పోలీసులు .. ఆమె కామెడీ చేయడంలో పోటీపడుతూ ఉంటారు. ఇంత కమెడియన్స్ ను పోలీసులుగా ఎలా తీసుకున్నారబ్బా అనే డౌటు ఆడియన్స్ కి రాకుండా ఉండదు. ఎటొచ్చి ఆ కామెడీ ఏ మాత్రం పేలకపోవడమే ఇక్కడ విచారించవలసిన విషయం. ఇక మహంకాళి పాత్ర సినిమా మొదలైన దగ్గర నుంచి చివరివరకూ క్షుద్రపూజలు చేస్తూనే ఉంటుంది. ఎందుకోసం ఈ పూజలు అనే విషయంలో ఒక క్లారిటీ మాత్రం మనకి రాదు. ఒకటీ రెండు డైలాగులను బట్టి 'ఇందుకోసం అన్నమాట' అని మనం అనుకోవాలంతే. ఇక హత్యకి గురైనవారితో అంతకుముందు దెయ్యానికి జరిగిన అన్యాయం ఏమిటా అనే ఇక ఆసక్తి ప్రేక్షకులలో కలుగుతుంది .. అది కూడా ఆ 'ముడి' విప్పేవరకు మాత్రమే. ఆ తరువాత ఓస్ ఇంతేనా అనిపిస్తుంది. ఇక నవీన్ చంద్ర ఉన్నాడు అంటే, అటువెళ్లి .. ఇటు వెళ్లి తిరిగి విలనిజం అనేది ఆయన పాత్రవైపుకే పరిగెత్తుకు వస్తుందనే సత్యాన్ని చాలా సినిమాలు ... సిరీస్ లు నిరూపించాయి. అదే ఆనవాయితీని అనుసరిస్తూ వెళ్లిన కంటెంట్ ఇది. ఇక నిర్మాత కృష్ణసాయి తనలోని నటుడిని బయటికి తీసుకొచ్చే ప్రయత్నమైతే చేశాడు.

ఆ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు .. పాటలు కృతకంగా అనిపించడమే ఇక్కడ నిరాశ పరిచే విషయం. శ్రీనివాస రెడ్డి కామెడీ చాలడం లేదనేదేమో .. సప్తగిరిని కూడా రంగంలోకి దింపారు. అయితే స్క్రిప్ట్ లో బలం లేకపోవడం వలన ఆయన కూడా ఏమీ చేయలేకపోయాడు. కథలో ఏవైతే బలమైన అంశాలో .. అవే బలహీనపడితే ఎలా ఉంటుందో .. అలా ఉంటుంది. హరీశ్ ఫొటోగ్రఫీ .. సుధీంద్ర టీమ్ నేపథ్య సంగీతం .. రేణుకా బాబు ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. సాధారణంగా హారర్ సినిమాలలో తెరపైకి దెయ్యాలు వచ్చేసి భయపడుతూ ఉంటాయి. కానీ ఈ సినిమా కామెడీతో భయపెడుతుంది .. అంతే తేడా.




## వచ్చేసింది కార్తీ 'సర్దార్ 2' టీజర్.. యాక్షన్ డోస్ నెక్ట్స్ లెవెల్!

### - అదరగొడుతున్న కార్తీ 'సర్దార్ 2' టీజర్- మరోసారి తండ్రీకొడుకుల పాత్రల్లో డ్యూయల్ రోల్- సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్

### - హాలీవుడ్ స్థాయి యాక్షన్‌తో పెరిగిన అంచనాలు

కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# కామన్వెల్త్ క్రీడలు: జూడోలో భారత్ గోల్డెన్ డబుల్..

## అస్మిత, హర్ష్‌లకు స్వర్ణాలు

**- కామన్వెల్త్ క్రీడల జూడోలో భారత్‌కు గంట వ్యవధిలో రెండు స్వర్ణాలు**

**- మహిళల 48 కేజీల విభాగంలో అస్మితా దే విజయం- పురుషుల 60 కేజీల విభాగంలో సత్తా చాటిన హర్ష్ సింగ్**

**- ఈ విజయాలతో భారత్ పతకాల సంఖ్య 19కి చేరిక- ఒకరు హోరాహోరీగా, మరొకరు ఏకపక్షంగా విజయాలు నమోదు**



కామన్వెల్త్ క్రీడలు 2026లో భారత జూడోకాలు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. జూడోలో భారత్‌కు గోల్డెన్ డబుల్ అందించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. మహిళల 48 కేజీల విభాగంలో అస్మితా దే, పురుషుల 60 కేజీల విభాగంలో హర్ష్ సింగ్ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని పోడియంపై నిలిచారు. గంట వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరు సాధించిన ఈ విజయాలతో గ్లాస్గోలో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. మహిళల 48 కేజీల విభాగంలో గురువారం జరిగిన ఫైనల్స్‌లో అస్మితా దే అద్వితీయమైన పోరాట పటిమను ప్రదర్శించింది. కెనడాకు చెందిన అనుభవజ్ఞురాలైన హీదీ క్యాచ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో అస్మిత 2-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం వ్యూహాత్మకంగా ఆడిన అస్మిత, కీలక సమయాల్లో సంయమనం పాటిస్తూ పాయింట్లు సాధించి కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. టోర్నమెంట్ మొదటి నుంచి నిలకడైన ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆమె, తుది పోరులోనూ అదే జోరును కొనసాగించి బంగారు పతకాన్ని ముద్దాడింది. అస్మిత స్ఫూర్తితో బరిలోకి దిగిన భారత యువ జూడోకా హర్ష్ సింగ్ కూడా సత్తా చాటాడు. పురుషుల 60 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్‌లో అతను పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాకు చెందిన జోషువా కాట్జ్‌తో జరిగిన టైటిల్ పోరును ఏకపక్షంగా మార్చేశాడు. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా సాధించే అవకాశం ఇవ్వకుండా, 10-0 తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. హర్ష్ వేగం, కచ్చితమైన ఎత్తుగడల ముందు ఆస్ట్రేలియా జూడోకా నిలవలేకపోయాడు. ఈ రెండు స్వర్ణాలతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 19కి చేరింది. ఇందులో 5 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్య పతకాలు ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు టోర్నీలలో సత్తా చాటిన హర్ష్ సింగ్, అస్మితా దేల విజయాలు దేశంలో జూడో క్రీడకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## 2027 ప్రపంచకప్‌కు అతణ్ని తీసుకోండి.. ?

### టీమిండియాకు అశ్విన్ సలహా

**భువనేశ్వర్‌ను తీసుకోవాలని అశ్విన్ సూచన**

**దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో బాగా రాణిస్తాడని విశ్వాసం**

**దేశవాళీ క్రికెట్ ఆడించి సిద్ధం చేయాలని సలహా**

**శ్రీలంకతో తొలి టెస్టులో ముగ్గురు స్పిన్నర్లను ఆడించాలని సూచన**

**జడేజా, సుతార్, కుల్దీప్‌కు చోటు ఇవ్వాలని సలహా**

**సాయి సుదర్శన్ ఫిట్‌నెస్ టీమిండియాకు బలమని వ్యాఖ్య**

టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయాలని సూచించాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో భువనేశ్వర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగలడని అభిప్రాయపడ్డాడు. అతణ్ని ఇప్పటి నుంచే దేశవాళీ టోర్నీల్లో ఆడిస్తూ ప్రపంచకప్‌కు సిద్ధం చేయాలని బీసీసీఐకి సూచించాడు. 2026 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపడంలో భువనేశ్వర్ కీలక పాత్ర పోషించాడు. 28 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. అయితే అతడు చివరిసారిగా 2022లోనే భారత్ తరఫున వన్డే ఆడాడు. అయినా అతడి అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అశ్విన్ పేర్కొన్నాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుపైనా అశ్విన్ స్పందించాడు. గాలే పిచ్‌ను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగాలని సూచించాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు ఇవ్వాలని చెప్పాడు. ఏడో స్థానంలో సారాంశ్ జైన్‌ను ఆడిస్తే జట్టు సమతుల్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. యువ బ్యాటర్ సాయి సుదర్శన్ ఫిట్‌నెస్‌పైనా అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల ఇండియా-ఏ తరఫున గాలేలో సెంచరీ చేయడం అతడికి పెద్ద ప్లస్ అవుతుందని తెలిపాడు. శ్రీలంక స్పిన్‌ను ఎదుర్కొనే సామర్థ్యం సాయి సుదర్శన్‌కు ఉందని చెప్పాడు. అతడు పూర్తి ఫిట్‌గా ఉంటే టీమిండియాకు పెద్ద బలమవుతుందని పేర్కొన్నాడు.

# ప్రజల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం...

## ఎమ్మెల్యే విజయశ్రీ ప్రజా దర్బార్

- 23 వినతులు స్వీకరణ.. శాఖల వారీగా అధికారులకు తక్షణ పరిష్కార చర్యల ఆదేశాలు
- ఇంటింటా ప్రచారంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే




**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగంగా పరిష్కారం చూపాలనే లక్ష్యంతో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ శుక్రవారం పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించి, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్ లో మొత్తం 23 వినతులు అందాయి. వాటిలో ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించినవి 11, తహసీల్దార్ కార్యాలయానికి 4, ఎంఈఓ కార్యాలయానికి 2 కాగా, వ్యవసాయ శాఖ, దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ, గృహనిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, నీటిపారుదల శాఖలకు సంబంధించినవి ఒక్కో వినతి చొప్పున నమోదయ్యాయి. ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా పరిశీలించి, ప్రజలకు సత్వర పరిష్కారం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రజా దర్బార్ ద్వారా నేరుగా



సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి వినతిపై ప్రత్యేక దృష్టి సారించి, శాఖల మధ్య సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అనంతరం అనకవోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కరపత్రాల ద్వారా వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో గ్రామ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, స్థానిక సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. అనకవోలు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, చైతన్య కృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, పేరం రమేష్ నాయుడు, లోకేష్ నాయుడు, మురళిరెడ్డి, సిద్ధిల్ నాయుడు, మాధవరెడ్డి, శేఖర్ నాయుడు, రవి, పరశురాం తదితర పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత

- పోలీసుల చొరవతో అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న మైనర్ బాలిక సురక్షితం
- సకాలంలో స్పందించి కుటుంబ సభ్యులకు అప్పగించిన నాయుడుపేట పోలీసులు
- అపరిచితుల మాయమాటలు నమ్మవద్దని ప్రజలకు జిల్లా పోలీసుల విజ్ఞప్తి.

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బాలల భద్రత,మహిళల రక్షణ,నేరాల నివారణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో నాయుడుపేట అర్బన్ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న ఒక మైనర్ బాలికను సురక్షితంగా గుర్తించి,కుటుంబ సభ్యులకు అప్పగించడం ద్వారా తమ బాధ్యతాయుత విధి నిర్వహణను మరోసారి చాటిచెప్పారు.నిన్న (30-07-2026) అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో, నాయుడుపేట బస్టాండ్ వద్ద నైట్ ఎన్ఆర్ఓ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఒంటరిగా అనుమానాస్పద పరిస్థితుల్లో సంచరిస్తున్న సుమారు 15 సంవత్సరాల వయస్సు గల మైనర్ బాలికను గుర్తించి అప్రమత్తంగా విచారించారు. విచారణలో, బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన అనంతరం ప్రస్తుతం తన అమ్మమ్మ వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తికి చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడటంతో అతని పిలుపు మేరకు శ్రీకాళహస్తికి వెళ్లేందుకు బయలుదేరినట్లు వివరించింది. అయితే తాను ప్రయాణిస్తున్న బస్సు శ్రీకాళహస్తి పట్టణంలోకి వెళ్లకుండా బైపాస్ మార్గంలో వెళ్తుందని డ్రైవర్ చెప్పడంతో నాయుడుపేట బస్టాండ్ వద్ద దిగినట్లు తెలిపింది. బాలిక పరిస్థితి అనుమానాస్పదంగా ఉండటంతో,ఆమె భద్రతను దృష్టిలో ఉంచుకుని హెడ్ కానిస్టేబుల్ కృష్ణ గారు వెంటనే నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.అనంతరం నాయు డుపేట డీఎస్పీ చెంచుబాబు ఆదేశాల మేరకు బాలిక తల్లికి సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌కు రప్పించారు.తల్లి సమక్షంలో బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి,అపరిచితులను నమ్మి ఇంటి నుంచి వెళ్లడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలికను క్షేమంగా ఆమె తల్లి సంరక్షణకు అప్పగించారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు,ఐపీఎస్. మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచడంతో పాటు,సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల ద్వారా పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులను నమ్మి మైనర్ బాలలు,బాలికలు ఇంటి నుంచి వెళ్లకుండా వారికి తగిన అవగాహన కల్పించాలని సూచించారు.

అలాగే,ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితుల్లో బాలలు కనిపించినా లేదా వారికి సహాయం అవసరమని గమనించిన వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజల అప్రమత్తత, తల్లిదండ్రుల అప్రమత్తమైన పర్యవేక్షణ,పోలీసుల సకాల స్పందన సమన్వయంతోనే బాలల భద్రతను మరింత సమర్థవంతంగా పరిరక్షించగలమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రాథమిక హక్కుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- చెంబడి పాలెంలో సివిల్ రైట్స్ డే నిర్వహణ- రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి: తహశీల్దార్ సి.హెచ్. హరికృష్ణ- గ్రామీణ ప్రజల్లో పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి: ఎంపీడీవో డాక్టర్ వేణయ్య




**పెళ్లకూరు –సూర్య వాస్తవం:** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులను తెలుసుకొని వాటిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పెళ్లకూరు తాసిల్దార్ సి. హెచ్. హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని చెంబడి పాలెం దళిత కాలనీలో శుక్రవారం నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హరికృష్ణ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కును కల్పించిందని అన్నారు. ఎవరైనా ఇతరుల హక్కులను కాలరాస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో డాక్టర్ వేణయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు, వెనుకబడిన వర్గాలకు పౌర హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, చదువుకున్న యువత ప్రజల్లో రాజ్యాంగంపై చైతన్యం పెంచేందుకు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 పూడి కస్తూరయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# తడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- కారు ఢీకొని ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తడ మండలం కొండూరు గ్రామం వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన కోటేశ్వరరావు మేస్త్రీ ద్వారా అర్జున్ భటారా (50) ఆయన కొడుకు కమలసి భటార, చైతూ, ఆయన కొడుకు దంబుదర్,దేవాదాస్ అనే ఐదుగురు కార్మికులు బేల్దారి పనుల కోసం మూడు రోజుల క్రితం తమ గ్రామం నుండి తడ మండలం కొండూరుకు వచ్చారు.వీరంతా కొండూరులోని మధుకాన్ లేఅవుట్‌లో నివాసముంటూ పనులు చేసుకుంటున్నారు. అయితే అర్జున్ భటారా(50)చైతూ భటారా (34) కాలకృత్యములకు వెళుతూ ఉండగా కారు ఢీకొన్నది దీంతో అర్జున్, చైతూలు ప్రమాదానికి గురయ్యారు మీరు 108 వాహనంలో సులూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలి స్తుండగా ఇరువురు మృతి చెందారు ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన వీరును పరిశీలించి, ఎస్సై కొండప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం,రెండు కళ్ళు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళు ఇలాంటివన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య,34వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ మునిశేఖర్ రాయల్ తెలిపారు.శుక్రవారం 34 డివిజన్ పరిధిలోని 114వ బూత్ లో రెండేళ్ల పాలనపై తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈ రెండేళ్ల కాలంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సుబ్బరామయ్యతో పాటు మునిశేఖర్ రాయల్ ఇంటింటికి వెళ్లి వివరించారు.34 డివిజన్ పరిధిలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఏ సమస్య వచ్చినా తాము ముందుండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ సురేష్ కుమార్, బూత్ కన్వీనర్ యశ్వంత్,ముని సుబ్రహ్మణ్యం, గంగయ్య,నైనార్ శ్రీనివాస్, వేణుగోపాల్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.నాగముని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజన ఏర్పాట్లు,ఆహారం నాణ్యత,పరిశుభ్రత,మెనూ అమలును పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల పోషకాహారం, హాజరు మరియు విద్యాభ్యాసానికి దోహదపడుతోందని అధికారులు పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండటంతో పాటు చదువుపై మరింత దృష్టి సారిస్తున్నారని తెలిపారు.కళాశాలలో భోజన నాణ్యత,పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను డైరెక్టర్ గారికి వివరించారు.విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ,నాణ్యమైన భోజనం అందిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వం రెండు సంవత్సరాల పూర్తితో ఇంటింటా ప్రచారం



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం బూట్ నెంబర్ 152,153 నందు రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాయచోటి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదేశానుసారం 152 153 బూత్‌లలో పట్టణ అధ్యక్షుడు బోనములకు ఖాదరవల్లి వార్డు మెంబర్లు కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరముల పూర్తి అయిన సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించడం జరిగినది వారితోపాటు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# అక్రమ మద్యం నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**- మైనింగ్ కార్యకలాపాల్లో పారదర్శకత, ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**
**- ఎక్సైజ్, గనుల శాఖల పనితీరుపై సమీక్ష.**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** జిల్లాలో అక్రమ మద్యం నిర్మూలన, బహిరంగ మద్యపాన నియంత్రణ, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (ఎక్సైజ్), పరిశ్రమలు , వాణిజ్యం (గనులు) శాఖలు మరియు టి ఈ ఆర్ విభాగం సీఈఓ ముఖేష్ కుమార్ మీనా, ఐ.ఏ.ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా ఎక్సైజ్ శాఖ,మైనింగ్ శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, గనుల శాఖల పనితీరుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (ఎక్సైజ్), పరిశ్రమలు ఒ వాణిజ్యం (గనులు) శాఖలు మరియు టి ఈ ఆర్ విభాగం సీఈఓ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. జిల్లాలో ఐడీ లిక్కర్ కు సంబంధించిన నేరాలను గణనీయంగా తగ్గించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలివచ్చే మద్యాన్ని అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత బలోపేతం చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎన్ డి పి ఎల్ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మైనింగ్ శాఖ పనితీరుపై సమీక్షలో భాగంగా జిల్లాలో ప్రస్తుతం అమలులో ఉన్న వర్కింగ్ లీజులు,నాన్-వర్కింగ్ లీజులు వాటి ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. నాన్-వర్కింగ్ లీజులు ఎందుకు ప్రారంభం కాలేదనే అంశాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖకు సంబంధించిన కార్యకలాపాలు, వర్కింగ్ లీజులు, నాన్-వర్కింగ్ లీజుల పరిస్థితి, ఖనిజ ఆదాయం, ఇసుక సరఫరా తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎక్సైజ్, గనుల శాఖలు మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ... జిల్లాలో ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధరలు పెరగకుండా, ప్రజలకు ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఇసుక నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇసుక ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకముగా వడ్డెర సహకార సంఘాలకు కొరకు భవన నిర్మాణ రాయి, రోడ్డు మెటల్, గ్రావెల్, స్లేట్, క్యూబ్స్ మరియు కర్బ్స్ వంటి ఖనిజాల క్వారీ లీజుల ప్రాధాన్యతలో భాగముగా, మైన్స్ అండ్ జియాలజి వారు వడ్డెర సహకార సంఘాల కొరకు 14 హెక్టార్ల భూమిని గుర్తించడము జరిగినది. భూముల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి అవసరమైన ఎన్ఓసీల (చీూజం) మంజూరును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అదేవిధంగా జిల్లాలో ఖనిజాల ద్వారా లభిస్తున్న ఆదాయం, జిల్లా పునర్వ్యవస్థీకరణ అనంతరం వచ్చిన ఆదాయ మార్పులు, కొత్తగా జిల్లాలో చేరిన ప్రాంతాలకు కలుగుతున్న ప్రయోజనాలపై అధికారులు సమగ్ర వివరాలను సమావేశంలో వివరించారు.
మైనింగ్ శాఖకు సంబంధించిన అన్ని అనుమతులు, లీజులు, ఆదాయ వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పారదర్శకంగా పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అనుమతులు, ప్రక్రియలను జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సబ్ కలెక్టర్ కళ్యాణి, కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్,గనుల శాఖ ఏడి రంగ కుమార్, ఎక్సైజ్ ఏఈఎస్‌లు జోగేంద్ర, పద్మావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,గనుల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికి... చంద్రన్న భరోసా

**- కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హిందూపురం నియోజకవర్గం పరిశీలకులు వై నాగేశ్వరరావు యాదవ్**



**కర్నూల్– సూర్య వాస్తవం :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం--2026" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హిందూపురం నియోజకవర్గంలోని బూత్ నం. 111, 112 లలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలోబూత్ నం. 111 బూత్ ఇన్‌చార్జ్ కుసుమ ప్రియా బూత్ నం. 112 బూత్ ఇన్‌చార్జ్ యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీ ముబారక్ క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీ ఇమ్దాద్ వార్డు ఇన్‌చార్జిలు పరిమళ శాంతమ్మ భారతమ్మ,ఎమ్మెల్యే సహాయకులు శ్రీనివాసులు , బాలాజీ ముఖ్య నాయకులు అంజనాప యూనిట్ ఇన్‌చార్జ్ వేణు ఌణా టెక్నీషియన్ శ్రీ నజీర్ అహ్మద్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే హిందూపురం నియోజకవర్గంలోని బూత్ నం. 115, 118, 119 లలో కూడా కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులోబూత్ నం. 115 బూత్ ఇన్‌చార్జ్‌లు జోహార్ వాలి జావి క్లస్టర్ ఇన్‌చార్జ్ రఘు బూత్ నం. 115, 118, 119 యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణస్వామి వార్డు ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యే సహాయకులు శ్రీనివాసులు బాలాజీ ముఖ్య నాయకులు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఐటీడీపి టెక్నీషియన్లు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, మెగా డీఎస్సీ, శ్రీశక్తి, దీపం పథకం, ఎన్టీఆర్ వైద్యసేవ, అన్న క్యాంటీన్ల ద్వారా ?5కే భోజనం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి తదితర సంక్షేమ, అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి, రైతుల సంక్షేమం, మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని ప్రజలకు వివరించారు. అలాగే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల సమస్యలు తెలుసుకుంటూప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తూప్రతి ఇంటికీ చంద్రన్న భరోసా అందిస్తూతెలుగుదేశం పార్టీ ప్రజలతో మమేకమై ముందుకు సాగుతోంది.చంద్రన్న భరోసా. కల్పిస్తున్నామని తెలియజేశారు.

## దోన్ పట్టణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**-- అధికారులకు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశం**



**దోన్ --సూర్య వాస్తవం:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శుక్రవారం మున్సిపల్, అమృత్-2.0, మెగా వాటర్ గ్రిడ్, నేషనల్ హైవే శాఖల అధికారులతోమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా పరిశీలించిన ఎమ్మెల్యే అమ్మ హోటల్ సర్కిల్ అభివృద్ధి పనులు, వినాయక ఘాట్ నిర్మాణం, అమృత్-2.0 వాటర్ పైప్‌లైన్ పనులులి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. శాఖల మధ్య సమన్వ యంతో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి దోన్ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్, అమృత్-2.0, మెగా వాటర్ గ్రిడ్, నేషనల్ హైవే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విరుపాక్షమ్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కోట్ల

**దోన్– సూర్య వాస్తవం:** కోడుమూరు పట్టణంలోని జీవీర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శ్రీమతి విరుపాక్షమ్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి దోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విరుపాక్షమ్మని సన్మానించి, విద్యారంగానికి ఆమె అందించిన సేవలను కొని యాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.




## కదిరి నిజాం వలి కాలనీ మున్సిపల్ హైస్కూల్లో దారుణం

**-మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థినులకు గుడ్డు కూర మీద పడి ఆరుగురికి గాయాలు**
**- వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలు.- సంఘటనపై విచారించిన ఎంఈవోలు**




**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** కదిరి పట్టణం నిజాంవలి కాలనీలోని ప్రభుత్వ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే సమయంలో జరిగిన సంఘటనలో ఆరుగురు విద్యార్థిని విద్యార్థులు గాయాల పాలయ్యారు. సంఘటన జరిగిన వెంటనే ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ చికిత్సలు అందించారు అనంతరం హైస్కూల్లో జరిగిన సంఘటన ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో హుటాహుటిన వారు అక్కడికి చేరుకుని జరిగిన సంఘటనపై విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థిని విద్యార్థులు గాయపడగా ఇద్దరు విద్యార్థినిలకు మాత్రం తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన విషయాన్ని హై స్కూల్ హెడ్మాస్టర్ మరియు కొందరు టీచర్లు బయటకు పక్కనేయకుండా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి బెడిసి కొట్టాయి. ఈ ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు మరికొంతమంది ఈ విషయాన్ని బయటికి చెప్పడంతో అందరికీ తెలిసిపోయింది.

**వెంటనే రంగంలోకి దిగిన ఎంఈఓలు**

చెన్నకృష్ణ, ఓబుల్ రెడ్డి హై స్కూల్ ను సందర్శించి అక్కడ జరిగిన పూర్వాపరాలను విచారించారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని విద్యార్థుల తో పాటు వారి తల్లి తండ్రులతో కూడా మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎంఈఓ లు జరిగిన సంఘటనపై వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రతిరోజు మధ్యాహ్న భోజన సమయంలో హెడ్మాస్టర్ వెంకటరమణారెడ్డి తో పాటు మధ్యాహ్న భోజన సమయంలో విధి నిర్వహణలో ఉన్న టీచర్లు పదో తరగతి విద్యార్థులతో వంట పాత్రలను మిగిలిన విద్యార్థినీ విద్యార్థుల క్యూ లైన్ వద్దకు తెప్పిస్తున్నట్లు పరిసర ప్రాంత ప్రజల నుంచి నే వ్యక్తం అవుతుంది ప్రమాదవశాత్తు కాలు బెణికి కింద పడడంతో ఎగ్గు కర్రీ విద్యార్థిని విద్యార్థుల పైన పడిందని హెడ్మాస్టర్ వెంకటరమణారెడ్డి ఎంఈఓ లకు ఎంత రిపోర్టు వచ్చినప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయని చెప్పవచ్చు చదువుకోవాల్సిన విద్యార్థుల చేత ఇలాంటి వంట పాత్రలు మోయించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు అయితే ఈ ప్రమాదంలో 6 మంది గాయపడినప్పటికీ నలుగురు విద్యార్థిని విద్యార్థులను మాత్రం స్కూలుకు పిలిపించుకొని పాఠాలు చెప్పారు మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వారు ఇంటి వద్దనే ఉండిపోయారు జరిగిన సంఘటనపై హెడ్మాస్టర్ వెంకటరమణారెడ్డి ఎంఈఓ లకు నివేదిక ఇచ్చారు అయితే నిజాంవలి కాలనీ ప్రభుత్వ హై స్కూల్ లో జరిగిన సంఘటన మాత్రం శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు పరిసర ప్రాంత జిల్లాలో కూడా సంచలనంగా మారింది అదేవిధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా వెళ్లడంతో ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపించి నివేదిక పంపించాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అయితే ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు విద్యార్థినిలకు తన సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తానని హెడ్మాస్టర్ వెంకటరమణారెడ్డి ఒప్పుకున్నట్లు హై స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల ద్వారా తెలిసింది. ఈ సంఘటన నుంచి తాను ఎలాగైనా సేఫ్ కావాలనే ఉద్దేశంతో హెడ్మాస్టర్ పై స్థాయిలో లాబీయింగ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ హైస్కూల్లో ఇద్దరు హెడ్మాస్టర్ల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న కోల్డ్ వార్ మధ్య విద్యార్థిని విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోతున్నారనే విషయం వారి తల్లిదండ్రులకు తెలిసినప్పటికీ వారు కూడా కొంతకాలం జరిగిన తర్వాత అయినా ఇద్దరి హెడ్మాస్టర్ల మనసుల్లో మార్పు వస్తుందేమో అనే భావన వ్యక్తం అవుతుంది అయితే ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడితే నిజా నిజాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి అవసరమైతే హైస్కూల్ ఆవరణంలో ఉన్న సీసీ ఫుటేజులను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవ విషయాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి. ఈ సంఘటనలో ఎవరిమీద శాఖా పరమైన చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే. కాగా వంట మనుషులు ఇద్దరు ఎగ్గు కర్రీ పాత్రను విద్యార్థిని విద్యార్థులకు వడ్డించడానికి తీసుకు వెళ్తుండగా ఇందులో ఒక మహిళకు కాలు బెణకడంతో ప్రమాదవశాత్తు పాత్ర కిందపడి కర్రీ విద్యార్థిని విద్యార్థుల పైన పడటంతో వారికి గాయాలు అయ్యాయని హెడ్మాస్టర్ వెంకటరమణారెడ్డి అంటున్నారు. మరోవైపు ఎంఈఓలకు కూడా ఇదే సమాచారాన్ని తమ నివేదిక ద్వారా సమర్పించినట్లు తెలుస్తోంది.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

**- జిల్లా వ్యాప్తంగా విస్తృత వాహనాల తనిఖీలు**
**- హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి.. వాహనదారులకు పోలీసుల సూచన**
**- మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగానికి దూరంగా ఉండాలని హెచ్చరిక**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని పోలీసులు సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని పోలీసులు స్పష్టం చేశారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని అనంతపురం జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.